ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో బుధవారం నుండి ఈ నెల 27వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న మొబైల్ ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నక్కపల్లి గ్రామ సచివాలయంలో నక్కపల్లి గ్రామస్తులు ఆధార్ అప్‌డేట్, కొత్తగా నమోదు చేసే విధంగా సచివాలయ ఉద్యోగులు ఏర్పాటు చేశారు.

సిఆర్‌జెడ్ నోటిఫికేషన్ 2011ను కొనసాగించాలి

2019 నోటిఫికేషన్ మత్స్యకారుల మనుగడకే ప్రమాదం

గ్రామస్థాయిలోనే ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి

నాలుగు గోడల మధ్య ప్రజలే లేకుండా అభిప్రాయ సేకరణ అంటే ఎలా..?

నిబంధనలను ఉల్లంఘిస్తున్న తీరప్రాంత పరిశ్రమ యాజమాన్యాలు

ప్రజాభిప్రాయ సేకరణలో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, మత్స్యకార సంఘాలు ఆవేదన

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

మాట్లాడుతున్న రాజాన దొరబాబు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ప్రజాభిప్రాయ సేకరణపై రోజురోజుకు ప్రజలకు నమ్మకం పోతుంది. బాధిత ప్రాంతాలలో సమావేశాలు నిర్వహించి బాధిత ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవలసిన అధికారులు నాలుగు గోడల మధ్య, ఏసీ రూములలో బాధిత ప్రజలే లేకుండా ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించడం అధికారుల ద్వంద్వ వైఖరికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ, భారత పర్యావరణ అటవీ వాతావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ తీర ప్రాంత సంబంధిత డ్రాఫ్టు కోస్టల్ జోన్ నోటిఫికేషన్ 2019 ఖరారు నిమిత్తం ప్రజాభిప్రాయ సేకరణ కలెక్టరేట్లో కలెక్టర్ విజయ్ కృష్ణన్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. అయితే ఈ ప్రజాభిప్రాయ సేకరణకు ఆరు మండలాలకు చెందిన 145 మత్స్యకార గ్రామాలకు చెందిన కనీస వాస్తవ మత్స్యకారులు ఎవరు హాజరు కాలేదు. ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు, కాంగ్రెస్, వైసీపీలకు చెందిన నాయకులు హాజరై ప్రజాభిప్రాయ సేకరణ జరిగే తీరును ఎండగట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ 145 గ్రామాలకు సంబంధించిన ఈ ప్రజాభిప్రాయ సేకరణను నాలుగు గోడల మధ్య నిర్వహించడం దుర్మార్గమన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని అప్పుడే గ్రామస్తుల బాధలు, అభిప్రాయాలు తెలుస్తాయని అన్నారు. తీర ప్రాంతాలలో ఉన్న పరిశ్రమల వల్ల ఇప్పటికే మత్స్యకారులు అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీర ప్రాంత పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి వదలడం వలన సముద్రం కలుషితమై చేపల మనగడ రోజుకి ప్రశ్నార్థకమవుతుందని అన్నారు. పూర్వం నుంచి ఉండే అనేక చేప జాతులు పరిశ్రమల వ్యర్థాల వల్ల కనుమరుగు అయిపోయాయని అన్నారు. జిల్లాలో ఇప్పటికే ఉన్న ఫార్మా పరిశ్రమల వల్ల కాలుష్యం వెదజల్లుతూ అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా వాటిని నియంత్రించే నాథుడే లేదని అన్నారు. మత్స్యకారుల మనుగడను ప్రమాదంలో నెట్టేసే వాటిని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ సంబంధిత గ్రామ ప్రజలు లేకుండా అభిప్రాయ సేకరణ ఎలా నిర్వహిస్తారని, ప్రస్తుత అభిప్రాయ సేకరణను రద్దుచేసి గ్రామస్థాయిలోని లేదా మండల స్థాయిలోని ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని సూచించారు. దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిసిహెచ్ రాజబాబు మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోవడంతో గ్లోబల్ వార్మింగ్ సంభవించి ఆ ప్రభావం సముద్రాలపై పడుతుందని అలాంటప్పుడు కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు ఎందుకు అనుమతులు ఇవ్వాలని ప్రశ్నించారు. కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఇలాంటి ప్రజాభిప్రాయ సేకరణలు ఎందుకని అన్నారు. ప్రభుత్వాలే ఇలాంటి వాటిని ప్రోత్సహించి తర్వాత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ఆలోచనలో ఉన్నట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అలాగే సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రామనాయుడు, నాయకులు అర్జునరావు మాట్లాడుతూ తీర ప్రాంతాన్ని పరిశ్రమల వ్యర్థాలతో డంపింగ్ యార్డ్‌గా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల జీవన విధానానికి హాని కలిగించే పరిశ్రమలను ఏర్పాటు చేయొద్దని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కే.లోకనాథం మాట్లాడుతూ రాజ్యాంగం 73, 74 ఆర్టికల్ ప్రకారం ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల మధ్య చేపట్టాలని, పంచాయతీ తీర్మానం తీసుకోవాలని తెలిపారు. చేపడుతున్న ప్రాజెక్టులు తీర ప్రాంతాన్ని డంపింగ్ యార్డ్‌గా మార్చరాదన్నారు. దీనివల్ల మత్స్యకారులు వేటకు వెళ్లే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్జీవో జెట్టి రామారావు, వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ, మత్స్యకార సంఘం నాయకులు సింహాద్రి, చింతకాయల ముత్యాలు, ఎం.అప్పలరాజు, చింతకాయల శివాజీలు మాట్లాడుతూ తీర ప్రాంతంలో నెలకొల్పిన ఫార్మా కంపెనీలు, పరిశ్రమలు తమ వ్యర్థాలను సముద్రంలో కలుపుతుండడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు, మత్స్యకారుల జీవన పరిస్థితులను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తడి నేలలు, పీతలు, తాబేలు వంటి జాతులు అంతరించి పోతున్నాయన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు గ్రామాల సహజ వనరులు, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ఉండాలన్నారు. ఈ దిశగా గతంలో అనేక కంపెనీలు చేపట్టి మత్స్యకారులు గ్రామస్తులతో చేసుకున్న ఒప్పందాలను బేఖాతరు చేశాయన్నారు. దీంతో భవిష్యత్తులో ఇక్కడ నెలకొల్పే పరిశ్రమల యాజమాన్యాలపై నమ్మకం కోల్పోయారన్నారు. 145 గ్రామాల ప్రజల, మత్స్యకారుల జీవన్మరణ సమస్య నేపథ్యంలో ఆయా గ్రామాల్లోనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 175 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, మత్స్యకారుల నుంచి 5500 ఎకరాలు తీసుకొని నేటికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఈ ప్రాంతాల్లో నెలకొల్పిన హేచరీస్ చేపల పెంపకందారులు ఈటీపీ శుద్ధి చేయకుండా వ్యర్థాలను సముద్రంలో విడుదల చేయడంతో మత్స్య సంపద నశించి మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 17 సంవత్సరాలుగా హెటిరో కంపెనీ ఎటువంటి అనుమతులు లేకుండా సిఆర్‌డి నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనసాగిస్తుందన్నారు. దీనిపై అటవీ పర్యావరణ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయగా ఆరు కోట్ల 70 లక్షల జరిమానా విధించడం జరిగిందన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా కాలుష్య నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేయాలని, అలాగే తీర ప్రాంతం పరిశ్రమలపై పర్యావరణ శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని కోరారు. ఇదిలా ఉండగా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు మత్స్యకారుల సమస్యలపై సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. అభిప్రాయ సేకరణలో డిఆర్‌ఓ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మరమ్మతులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు జాతీయ రహదారిపై మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 22వ తేదీన విశాలాంధ్ర దినపత్రికలో గుంతలు పడిన జాతీయ రహదారి అనే కథనంపై అధికారులు స్పందించారు. దీంతో హైవే అథారిటీ నిర్వాహకులు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహన దారులు హర్షం వ్యక్తం చేశారు.

జెడ్పీటీసీని పరామర్శించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జెడ్పీటీసీ లంకా సూర్యనారాయణను వైసీపీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుటుంబాన్ని నేతలు ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, జిల్లా ప్రచార కమిటీ విభాగం అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, ఎంపీటీసీ కొంతం నరేష్, కో ఆప్షన్ సభ్యులు కాదా రామకృష్ణ, గెడ్డమూరి శ్రీనివాసరావు, చేపల తాతాజీ, కేసనకుర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్ రౌతు

విశాలాంధ్ర - పరవాడ: విశాఖపట్నం గ్రేటర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన సంపత్ కుమార్‌ను జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కమిషనర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం వార్డులో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వార్డు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

నారుమడిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

విశాలాంధ్ర - చీడికాడ: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా వరి నారుమడిలో నీటిని నిల్వ లేకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో ఎం.రమాదేవి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో వీఏఏలతో కలిసి మంగళవారం పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దండిసురవరం, దిబ్బపాలెం, తునివలస గ్రామాలలో 1.3 హెక్టార్లలో వరి నారు నుండి నీరు బయటకు పోయే అవకాశం లేనందున నారు దెబ్బతిన్నట్టు గుర్తించామన్నారు. ప్రతి ఐదు సెంట్లు వరి నారు మడికి ఒక కేజీ యూరియా, ఒక కేజీ ఎంఓపి వేసుకోవాలన్నారు. వర్షాల కారణంగా నారుమడులకు పొడతెగులు సోకే అవకాశం ఉన్నందున ముందుగా రైతులు ఒక గ్రాము కాల్షియం లేదా మాటజెట్ మూడు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి నారుమడికి వేసుకోవాన్నారు. ఈ వర్షాలు వరి, చెరుకు పంటలకు అనుకూలంగా ఉంటాయన్నారు. రైతులకు పంట పొలాలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు ఇచ్చారు.

కౌలు రైతులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని వారికి కూడా ప్రభుత్వపరంగా పలు రాయితీలు, రుణాలు ప్రభుత్వం కల్పిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రావు అన్నారు. మంగళవారం కే.కోటపాడులో కౌలు రైతు డోకల మోహన్రావుకు కౌలు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు వీఆర్వోలను సంప్రదించాలన్నారు. కార్డులు పొందటానికి ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే మండల తహశీల్దార్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం వారాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది ఆచరిస్తున్న పద్ధతులను అడిగి తెలు సుకున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలని మట్టి నమూనాలను సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమశేఖర్, వీఏఏలు దొర, హరీష్, సుధీర్, పూజిత తదితరులు పాల్గొన్నారు.

కోళ్లు వ్యాన్ బోల్తా

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం గ్రామం సమీపంలో కోళ్ల వ్యాన్ బోల్తా పడింది. మంగళవారం తెల్లవారుజామున యస్.రాయవరం నుంచి వ్యాన్ ధర్మవరం వెళున్న సమయంలో రోడ్డుపై అదుపు తప్పి దూసుకొని పోయింది. అదే ప్రదేశంలో కొబ్బరి చెట్టు ఢీకొట్టడంతో జరగడంతో చెట్టు విరిగి పోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఘనంగా మోదకొండమ్మ పండగ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో మంగళవారం ఉదయం వందలాదిమంది మాడుగుల మోదకొండమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. మాడుగులకు చెందిన పలువురు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 101 ఘటాల పండగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను శిరస్సున ధరించి డప్పులు బ్యాండ్ మేళం, భారీ మందు గుండుసామాగ్రితో భారీ ఊరేగింపు గ్రామం వీధులలో నిర్వహించి అనంతరం అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జనసేన పార్టీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

విశాలాంధ్ర - పాయకరావుపేట: జనసేన పార్టీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా లభిస్తుందని జనసేన పార్టీ నాయకులు తోట నగేష్ అన్నారు. సభ్యత్వం స్వీకరించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం ఉన్నవారికి రూ.5 లక్షలు బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు సుమారు రూ.18 కోట్లు బీమా చెక్కులు బాధిత కుటుంబాలకు అందించారని తెలిపారు. జనసేన పార్టీ సభ్యత్వం తీసుకుంటే కల్పించిన బీమా సౌకర్యం ఇతర పార్టీలకు లేదన్నారు. సభ్యత్వం తీసుకునేవారు రూ.500 చెల్లిస్తే మరో రూ.1500 పార్టీ అధిష్టానం చెల్లించి బీమా సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. గత ఏడాది నియోజకవర్గంలో 5 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు కాగా ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సభ్యత్వాల నమోదుకు వందమంది వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అధిక నిధులు కేటాయించడం పట్ల తోట నగేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేష్‌లకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజరపు సూరిబాబు, రాజా రమేష్, ఐ.ఎన్.మూర్తి, జగతా శ్రీను, జగతా శ్రీధర్, ముక్కుడుపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - మునగపాక: ఉపాధి హామీ కూలీలకు 10 వారాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో (సిఐటియు) మంగళవారం ఉపాధి హామీ కూలీలు సచివాలయాల వద్ద నిరసన తెలిపి సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుస్తున్న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న అత్యంత పేదలైన కూలీలకు 10 వారాలుగా వేతన బకాయిలు ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గం అన్నారు. అట్టడుగు వర్గాల నుంచి ఏ ఆధారం లేకుండా ఉపాధి హామీ పనులే చేసుకుని వాటి ద్వారా వచ్చే ఆదాయంతోనే తమ కుటుంబాలు నెట్టుకొస్తున్న వారికి పది వారాల పాటు వేతనాలు చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైతారుపేట జెడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో సైతార్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎలమంచిలి ఏరియా జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి.అప్పారావు తనిఖీ చేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు బోధన విషయంలో ఉపాధ్యాయులు నిబంధనలను పాటిం చాలని సూచించారు. మధ్యాహ్నం భోజన పథకంలో నాణ్యత ఉండాలని ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో కార్మికుడు మృతి

విశాలాంధ్ర - పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒడిస్సాకు చెందిన కార్మికుడొకరు మృతి చెందారు. కబీరాజ్ సాహెూ(49) అనే కార్మికుడు ఎఫ్‌బ్లాక్‌లో పనిచేస్తుండగా వాక్యూం లీక్ అయి కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు చెబుతున్నారు. ఒడిస్సాకు చెందిన కార్మికుడు ఇక్కడ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తూ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఫార్మాసిటీలో ఇటీవల భద్రతా చర్యలు కరువయ్యాయని, మృతిచెందిన కార్మికుని కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్‌అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్మైలెక్స్ ఫార్మాలో జరుగుతున్న ప్రమాదాలపై సంబందిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చెట్లు నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర - కోటవురట్ల: పొలంలో చెట్లు నరికి వేసిన సంఘటనపై బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు వల్లెల నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం కోటవురట్ల పంచాయతీ పరిధిలో గల సర్వే నెంబరు 413లో గల తన భూమిలో 30 సం.ల వయసు గల నేరేడు చెట్లను లింగాపురం గ్రామానికి చెందిన కర్ర వ్యాపారి రాజాన రామకృష్ణ దొంగ చాటున నరికివేసి అమ్మేసుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భూమిలో ఉన్న నేరేడు చెట్లను గ్రామ దేవతగా అడవి రాజుల బాబు దేవుడిగా భావించి పండగలను కోటవురట్ల గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకుంటారన్నారు. దేవతలుగా పూజించే నేరేడు చెట్లను దొంగ చాటున అక్రమంగా నరికివేసి అమ్మేసుకున్నారని ఆయన విశాలాంధ్ర వద్ద వాపోయారు. అనంతరం జరిగిన నష్టంపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై ఎస్సై రమణయ్యను వివరణ కోరగా చెట్లు నరికి వేసిన సంఘటనపై బాధిత రైతు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అక్రమదారుడుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జానకి శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ, జనసేన నాయకులు బాధిత రైతు భూముల్లోకి వెళ్లి నరికి వేసిన చెట్లను పరిశీలించారు. రైతుకు జరిగిన నష్టంపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారంతా బాధ్యత రైతుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటవురట్ల గ్రామ టీడీపీ అధ్యక్షులు కసిరెడ్డి ఏసు, సెక్రటరీ బత్తుల రామకృష్ణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కోటి, జానకి శివ, సిద్దాబత్తుల వరహాలబాబు, తంగేటి శ్రీను, పదిలం గోవిందు, జనసేన మండల పార్టీ నాయకులు బద్రి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఒరిగిందేమి లేదు

పీసీసీ జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్

విశాలాంధ్ర - పాయకరావుపేట: కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని పీసీసీ జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ఆరోపించారు. బడ్జెట్లో అంకెలు, కాల పరిమితి ఉండాలని అయితే కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల మేనిఫెస్టోలా ఉందని విమర్శించారు. రాష్ట్రానికి 12 లక్షల కోట్లు అవసరం ఉండగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం లక్ష కోట్లు మాత్రమే అడిగారని, అందులో అరకొర నిధులు మాత్రమే కేటాయించారని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు అన్నారే గాని ఎంతో ప్రస్తావించలేదన్నారు. బడ్జెట్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన లేదన్నారు. బీజేపీ మరోసారి మోసం చేస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రహించు కోవాలని తెలిపారు. కేంద్ర సంస్థల స్థాపన ఊసే లేదన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఐదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని, హోదానే రాష్ట్రానికి సంజీవిని అని, హోదా వస్తేనే పరిశ్రమలు వస్తాయని ప్రకటించారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా రాష్ట్రాన్ని మోసం చేస్తూ వచ్చిందని, మరోసారి మోసం చేయడానికి చూస్తున్నారని జగతా శ్రీనివాస్ ఆరోపించారు.

సబ్బవరం పీఎస్‌ను ఎస్పీ దీపిక తనిఖీ

విశాలాంధ్ర - సబ్బవరం: జిల్లా ఎస్పీ ఎం.దీపిక సబ్బవరం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషను ప్రాంగణంలో గల వాహనాలు ఏ కేసుల్లో సీజ్ చేసినవి, ఎందుకు స్టేషను ప్రాంగణంలో ఉన్నవి అన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజ్ చేసిన వాహనాలకు ఆయా కేసుల వివరాలను ట్యాగ్ చేయాలన్నారు. స్టేషన్ రిసెప్షన్ పుస్తకం మెయింటైన్ చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. తరుచు రిపోర్ట్ అవుతున్న నేరాలు గురించి ఆరా తీశారు. రౌడీ షీటర్స్, చెడునడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు, అక్రమ రవాణా కారకులైన ప్రధాన వ్యక్తులను గుర్తించి, అరెస్టు చేయాలన్నారు. స్టేషను పరిధిలో గతంలో పట్టుబడిన గంజాయి కేసుల సీడీ ఫైల్స్, తీవ్రమైన కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి, ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని సూచనలు ఇచ్చారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలని, నేర నియంత్రణకు, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సమయంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, సబ్బవరం ఇన్స్పెక్టర్ పి.రమణ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలి

విశాలాంధ్ర - పరవాడ: వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని డాక్టర్ లూసీ వైద్య సిబ్బందికి సూచించారు, వెన్నెలపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు మంగళవారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీసి రికార్డులు పరిశీలించారు. గర్భిణీ స్త్రీల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు అమలు, పీఎం మాతృత్వ వందన యోజన, జననీ సురక్ష యోజన తదితర పథకాలు హెచ్ఎంఐఎస్ఆర్‌సిహెచ్ ఆన్ లైన్ ఏవిధంగా జరుగుతుంతో పరిశీలించారు. డాక్టర్ లూసి మాట్లాడుతూ గర్భిణీల వివరాలు సకాలంలో నమోదు చేస్తూ అవసరమైన ప్రసూతి, వైద్య సేవలు అందించాలన్నారు. మాతృ, శిశు మరణాలు జరగకుండా మాతృ శిశు సంరక్షణలో భాగంగా ఆసుపత్రిలోనే సుఖప్రసవం జరిగేలా,పుట్టిన బిడ్డకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు అందేలా పనిచేయాలని సూచించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. స్టాఫ్ డయేరియా, మలేరియా, ఎల్సిడిసి తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డాక్టర్ హారిక, డాక్టర్. జయశ్రీ, కరిష్మా, డిపిహెచ్ ఎన్.నాగమణి, డిపిఓ జగదీష్, ఎస్ఓపి. రామచంద్రరావు, డేటా మేనేజర్ వై జనార్ధన్‌రావు, సిహెచ్. ఓఎంఎస్ ఎస్ సాయిరాం, హెచ్‌వి పి.వి రత్నం, ఎంపిహెచ్ ఎస్.సతీష్ కుమార్, ఎంపిహెచ్ ఎ.శ్రీను, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.